ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

మంగళవారం 11, జూలై 2023

తాగు నీటి సమస్యలు పరిష్కరిస్తున్న

- కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: అంబర్ పేట డివిజన్ లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎదురవుతోన్న సమస్యలు పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఇయ్యాల ఆయన రఘునాథ్ నగర్ లో పర్యటించి స్థానిక బస్తీ ప్రజల తో కలిసి తాగు టీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యని పరిశీలించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తి ప్రజలు ఉన్నారు.

రఘునాథ్ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఇ.విజయ్ కుమార్ గౌడ్

రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే రేవంత్‌కు ఏడుపు ఎందుకు?

2

రేవంత్‌రెడ్డి చెప్పింది నడవదు ఇక్కడ.... నేను సీనియర్‌ను: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మరో ట్విస్ట్..

2

జనాభా పెరుగుదలతో పెను సవాళ్లు...

ప్రపంచ జనాభా దినోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 11: ప్రపంచంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాతో పెను సవాళ్లు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

దాంతో ఆర్థిక సంక్షోభంతో పాటు పేదరికంపై ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. ఇయ్యాల మంగళావరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాచిగూడ మున్నూరు కాపు సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజారోగ్యం విషయంలో వైద్యులు, ఆశా వర్కర్లు మరియు ఆరోగ్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో వారు అందించిన సేవలు అసామాన్యం అని కొనియాడారు. ప్రజలు కూడా కుటుంబ నియంత్రణ పట్ల మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. అందుకు ఆరోగ్య శాఖ రూపొందించిన ప్రతిజ్ఞను, సభలో పాల్గొన్న వారి చేత చెప్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కాచిగూడలో ప్రపంచ జనభా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

దివ్యాంగులకు స్టడీ మెటీరియల్ అందజేత

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: భవసార్ క్షత్రియ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇయ్యాల గోల్నాక క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దివ్యాంగులకు నోట్ బుక్స్, బ్యాగులు, లంచ్ బాక్సుల తో పాటు ఇతర స్టడీ మెటీరియల్ అందజేశారు .ఈ కార్యక్రమంలో భవసార్ క్షత్రియ అసోసియేషన్ కార్యదర్శి అశ్విని కుమార్ పతంగే, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గోల్నాకలో దివ్యాంగులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బీసీ కులవృత్తిదారులకు రూ.1లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కులవృత్తులకు పూర్వవైభవం రావాలి

బీసీ బంధు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక చేయూతతో కులవృత్తులకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. కులవృత్తిదారుల అభ్యున్నతే ధ్యేయంగా అనేక చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఇయ్యాల మంగళవారం ఎమ్మెల్యే క్యార్టర్స్‌లో అంబర్ పేట నియోజక వర్గానికి చెందిన 5 మంది బీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు సీఎం కేసీఆర్ ఎప్పుడూ అండగా నిలుస్తారని, మెరుగైన ఉపాధి కల్పించుకోవాడానికి వీలుగా వృత్తి సంబంధిత పనిముట్లు కొనుక్కోవడానికి ఆయన ప్రత్యేక పథకం ద్వారా బీసీ వర్గాలను ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న, ఇతర అధికారులు, బీఆర్ ఎస్ నాయకుడు పులిజాల గెల్వయ్య తదితరులు ఉన్నారు.

జైస్వాల్ గార్డెన్ కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న చింతల శ్రీనివాస్ ముదిరాజ్

'జైస్వాల్ గార్డెన్లో సమస్యలు పరిష్కరించాలి

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ కాలనీలో తాగునీటి సరఫరాలో సమస్యలతో పాటు డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ కోరారు. ఇయ్యాల జలమండలి మేనేజర్ రోహిత్ తో కలసి ఆయన కాలనీలోని సమస్యలను పరిశీలించారు. బోనాల పండుగ నేపథ్యంలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు .ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు సి. యాదవ రెడ్డి. అనిల్ చారి, అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

బోనాల పండక్కి రావాలి..

మంత్రి తలసానికి దేవస్థాన కమిటీ ఆహ్వానం

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: అంబర్ పేట్ మహంకాళీ దేవస్థాన సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే ఆషాడ మాసం బోనాల జాతరకు హాజరు కావాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఇయ్యాల ప్రతినిధులు మంత్రి తలసానిని కలిసి ఆహ్వానం పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో దేవస్థాన సేవా సమితి చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ గౌడ్, చీఫ్ అడ్వైజర్ కె. దుర్గాప్రసాద్ రెడ్డి, అధ్యక్షులు వైశంకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున గౌడ్, కోశాధికారి గడ్డం శ్రీధర్ గౌడ్, కార్యదర్శి చెంగలి సుధాకర్, పంజాల గిరిధర్ గౌడ్, దోమకొండ కిశోర్ తదితరులు ఉన్నారు

మంత్రి తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అంబర్ పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

క్వాలిటీలో నో కాంప్రమైజ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: డెవలప్ మెంట్ విషయంలో క్వాలిటీలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పష్టం చేశారు. ఇయ్యాల మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాచిగూడ డివిజన్ కాశిరాంజీరా ప్రాంతంలో పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు పనులను బోనాల పండుగ లోపు పూర్తి చేయాలని, ఖచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాశీరాంజీరాలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

కొత్త దుర్గానగర్‌లో బస్తీ వాసులతో మమేకమై సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డి

కొత్త దుర్గానగర్‌లో మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డి

బీఆర్ఎస్ బస్తీ బాట

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 11: అంబర్‌పేట కొత్త దుర్గానగర్ లో ఇయ్యాల మంగళవారం మాజీ కార్పొరేటర్, బీఆర్ ఎస్ నేత కె.పద్మావతిడీపీ రెడ్డి బీఆర్ఎస్ బస్తీ బాట కార్యక్రమం చేశారు.

బస్తీ వాసులతో మమేకమై వారి బాగోగులతో పాటు అక్కడున్న సమ స్యలు తెలుసుకున్నారు. తెలంగాణ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని భరో సా కల్పించారు. సయోధ్య ద్వారా చదువులో వెనుకబడి ఉన్న పిల్లలకు ట్యూషన్లు చెప్పిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కేఆర్ కే హైస్కూల్లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థుల పేరెంట్స్

కేఆర్‌కే హైస్కూల్లో ఉచిత వైద్య పరీక్ష శిబిరానికి స్పందన

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 11: అంబర్ పేట డివిజన్ చెన్నారెడ్డినగర్ కేఆర్ కే హైస్కూల్లో ఇయ్యాల మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్షల శిబిరానికి మంచి స్పందన వచ్చింది.

విజయా డయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు రెండు వందల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు బీపీ, షుగర్, కొలస్ట్రాల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వామి దయానంద్ విద్యాసంస్థల ఛైర్మన్ కెంచె రవికుమార్‌తో పాటు స్కూల్ కరస్పాండెంట్ స్నేహ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కరెంట్ షాకివ్వాలి..

మంత్రి హరీశ్‌రావు ఫైర్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: ఉచిత కరెంట్‌పై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన అడ్డగోలు మాటలపై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ట్విట్టర్ వేదికగా రేవంత్‌పై హరీశ్‌రావు మండిపడ్డారు. రైతన్న సంక్షేమం కోసం ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేసీఆర్ పాలనలో రైతులకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అధికారంలోకి వస్తే అందకుండా చేస్తామంటూ అడ్డగోలుగా మాట్లాతున్నారని నిప్పులు చెరిగారు.

24 గంటల ఉచిత విద్యుత్‌కు వ్యతిరేకంగా

రేవంత్‌రెడ్డి ప్రకటన...

కాంగ్రెస్ దిష్టిబొమ్మల దహనానికి కేటీఆర్ పిలుపు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 8 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా ఇవాళ, రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మలు దహనం చేయాలని సూచించింది. ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని రద్దు చేయాలన్న దుర్మార్గపు ఆలోచన కాంగ్రెస్ పార్టీది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. విద్యుత్ ఇవ్వకుండా గతంలో రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి తన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టుకుందని అన్నారు.

కాంగ్రెస్ నిర్ణయాన్ని తెలంగాణ రైతాంగం, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు.

రైతులకు ఉచిత విద్యుత్ అక్కర్లేదు

రేవంత్ వ్యాఖ్యల దూమారం..

మళ్ళీ మొదటికొచ్చిన కాంగ్రెస్ యవ్వారం

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: అమెరికాలోని పెన్సిల్వేనియాలో జరుగుతున్న తానా మహాసభలలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ చీఫ్ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోని రైతులకు ఉచిత విద్యుత్ అక్కర్లేదని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం రైతులకు కేవలం మూడు ఎకరాలు మాత్రమే ఉందని చెప్పుకొచ్చారు. ఆ మూడెకరాలను తడిపేందుకు 24 గంటల ఉచిత విద్యుత్ అక్కర్లేదని, మూడు గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తే సరిపోతుందని చెప్పారు. తాము 8 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థల నుంచి వచ్చే కమీషన్ల కక్కుర్తితో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఉచిత విద్యుత్ నిర్ణయం తీసుకున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరోపక్క తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికార పక్షం నేతలతో పాటు మంత్రులు, కార్యకర్తలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇటు సొంత పార్టీ కాంగ్రెస్ లోనూ రేవంత్ వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా రేవంత్ వ్యాఖ్యలు పార్టీకి చేటు కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే రేవంత్‌కు ఏడుపు ఎందుకు?

- జగదీశ్ రెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: తెలంగాణ రైతులకు 24 గంటలూ ఉచితంగా విద్యుత్ అందిస్తే రేవంత్ రెడ్డికి ఏడుపు ఎందుకని మంత్రి జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రైతులపై మీకు, మీ పార్టీకి కక్ష ఎందుకని రేవంత్ రెడ్డిని నిలదీశారు. అమెరికాలో జరుగుతున్న తానా

మహాసభలలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి జగదీశ్ రెడ్డి తాజాగా స్పందించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాశనం చేసిందని ఆరోపించారు. రైతులు బాగుపడుతుంటే ఆ పార్టీ ఓర్వలేకపోతోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు సూచన అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విధానాలపై, రైతు వ్యతిరేక ధోరణిపై ఆలోచన చేయాలంటూ మంత్రి జగదీశ్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కు ఓటేయాలని భావించే రైతులు మరోసారి ఆలోచించుకోవాలని సూచించారు. రేవంత్ వ్యాఖ్యలు ఆషామాషీగా చేసినవి కావని హెచ్చరించారు. తాను ఏం మాట్లాడినా రాహుల్ గాంధీ అనుమతితోనే మాట్లాడతానని రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ఎత్తివేయడం ఖాయమనేందుకు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనమని మంత్రి జగదీశ్ రెడ్డి చెప్పారు.

రేవంత్ వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌ను ఏకిపారేసిన కేటీఆర్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: ఉచిత విద్యుత్ అంశంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో కాకరేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై అధికార బీఆర్ఎస్ నిప్పులు చెరుగుతోంది. తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలపై మంగళవారం స్పందించారు. రైతులకు ఉచిత విద్యుత్ రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ దుర్మార్గపు ఆలోచన చేస్తోందని మండిపడ్డారు. గతంలోనూ రైతులకు విద్యుత్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎనిమిది గంటల విద్యుత్ మాత్రమే ఇస్తామని పీసీసీ చీఫ్ రేవంత్ చెప్పడం ద్వారా ఆ పార్టీ రైతు వ్యతిరేక విధానాలు మరోసారి వెల్లడయ్యాయన్నారు. కాంగ్రెస్ ఆలోచనలను తెలంగాణ ప్రజలు, రైతులు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఇదిలా ఉండగా, హిమాచల్ ప్రదేశ్ లో తెలుగు విద్యార్థులు చిక్కుకుపోవడంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. కులు, మనాలిలో విద్యార్థులు చిక్కుకున్నట్లు బాధితుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. వెంటనే ఢిల్లీలోని రెసిడెంట్ కమిషన్ ను అప్రమత్తం చేశామని, బాధిత విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని కోరామన్నారు. సహాయం కోసం టీఎస్ భవన్, కేటీఆర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేవంత్‌రెడ్డి చెప్పింది నడవదు ఇక్కడ....

నేను సీనియర్‌ను: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: అమెరికాలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇయ్యాల రాష్ట్రంలో పెద్ద దుమారం రేపుతున్నాయి. ఉచిత విద్యుత్‌పై ఆయన చేసిన వ్యాఖ్యల్ని అధికార బీఆర్ఎస్సే కాకుండా కాంగ్రెస్ నేతలు కూడా ఖండిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ, రేవంత్ మాటలు ఆయన వ్యక్తిగతమని, ఆయన చెప్తే ఫైనల్ కాదని అన్నారు.

అయినా ఆయన ఏ సందర్భంలో మాట్లాడారో కూడా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి జాతీయ సిద్ధాంతముందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ గా తాను చెబుతున్నానని 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. అసలు రైతులకు ఉచిత విద్యుత్ ను మేనిఫెస్టోలో పెట్టి ఏడు గంటలు ఇచ్చిన పార్టీయే కాంగ్రెస్ అన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తాము తీసుకు వచ్చామని, అలాంటి దానిపై తాము ఎందుకు వెనక్కి వెళ్తామన్నారు. ఆయన టీవీ9తో ముఖాముఖిలో మాట్లాడారు. నేనే కాంగ్రెస్... కాంగ్రెస్సే రేవంత్ అనే మాట రేవంత్ అంటే కనుక అది తప్పు అన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ అన్నారు. తాను, రేవంత్ వంటి నేతలం కేవలం కో-ఆర్డినేటర్లమని చెప్పారు. అయినా ఆ మాట రేవంత్ అన్నారా.. మీరు విన్నారా అని మీడియా ప్రతినిధిని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది కూడా అధిష్ఠానం నిర్ణయిస్తుందని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలనుకుంటే దామోదర రాజనర్సింహ, మల్లు భట్టి విక్రమార్క, పోదెం వీరయ్య వంటి సీనియర్ నేతలు ఉన్నారన్నారు. ఉచిత విద్యుత్ అయినా.. ముఖ్యమంత్రి అభ్యర్థి అయినా రేవంత్ చెబితే నడవదని, అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు.

ఎల్లో అలర్ట్.. తెలంగాణలో ఐదు రోజులు భారీ వర్షాలు!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: తెలంగాణలో రాగల ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ

కేంద్రం హెచ్చరించింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యర్మాల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని వెల్లడించింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, హబూబాబాద్, వరంగల్, హన్మకొండలో భారీ వానలు పడుతాయని చెప్పింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.

శుక్రవారం నుంచి శనివారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని చెప్పింది.

బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం..

రూ.400 కోట్లు విడుదల!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కులవృత్తులు, చేతివృత్తి పనుల చేసుకునే బీసీ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించే పథకానికి అర్హుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలోనే పథకానికి రూ.400కోట్ల నిధులను బీసీ సంక్షేమ శాఖ విడుదల చేసింది. ఈ నిధులను పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు అందించనున్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకెళ్తోన్న తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కులవృత్తులు, చేతివృత్తులకు చేయూతనందించేందుకు ఆర్థిక సాయం ప్రకటించింది.

కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రారంభించగా.. పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆర్థిక సాయం కోసం విశ్వ బ్రహ్మణులు, నాయీ బ్రహ్మణులు, రజకులు, కుమ్మరి, మేదరి తదితర కులాలకు చెందిన వారు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

అర్హులైన కులవృత్తులు, చేతివృత్తి పనులు చేసుకుంటున్న వారికి పనిముట్లు, ముడిసరుకు కొనుగోలు కోసం ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నది. మరో వైపు కులవృత్తులు, చేతివృత్తులు చేసే బీసీ కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించే పథకానికి అర్హుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలవారీగా అందిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి, అర్హులైన వారి జాబితాలు రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సూచించింది. కలెక్టర్లు తమ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఈ బాధ్యతలు అప్పగించారు. మండల పరిషత్ అధికారులు, మండల పంచాయతీ అధికారులు దీనిపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు నిర్ణీత నమూనా పత్రాన్ని పంపగా.. కార్యదర్శులు సమాచారం సేకరిస్తున్నారు.

తెలంగాణలో ప్రియాంక చక్రం తిప్పుతారా.?

కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చుతారా.?

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: మొన్నటి వరకు బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామే అని చెప్పుకున్న బీజేపీకి ఒక్కసారిగా జలక్ ఇస్తూ కాంగ్రెస్ పార్టీ దూసుకొచ్చింది. కర్ణాటక ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీతో తెలంగాణ కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. అందులోనూ పార్టీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులు వేస్తుండడం ఆ పార్టీకి తెలంగాణలో పూర్వ వైభవం తీసుకొస్తుందన్న వార్తలకు బలం చేకూర్చినట్లైంది. మరీ ముఖ్యంగా ఇటీవల మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీతో పాటు మరికొందరు నేతలు పార్టీలో చేరడం, జులై 2వ తేదీన రాహుల్ గాంధీ అధ్యక్షతన ఖమ్మంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతం కావడం కూడా పార్టీలో జోష్‌ని పెంచింది. ఇదిలా ఉంటే ఈ జోష్‌ని మరింత పెంచే దిశగా ప్రియాంక గాంధీ రంగంలోకి దిగనున్నారు. కర్ణాటక ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రియాంక ఇప్పుడు తెలంగాణపై దృష్టిసారించనున్నారు. తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలన్న సంకల్పంతో ఆమె తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారనున్నారు. ఇందులో భాగంగానే ప్రియాంక ఇప్పటికే తెలంగాణలో పర్యటించారు. సరూర్ నగర్‌లో జరిగిన యువ సంఘర్షణ సభలో పాల్గొన్న విషయం విధితమే. ఇక తాజాగా మరోసారి తెలంగాణకు విచ్చేయనున్నారు ప్రియాంక. ఈ నెల 20వ తేదీన ప్రియాంక తెలంగాణలో పర్యటించనున్నారు. కొల్లాపూర్‌లో జరగనున్న బహిరంగ సభలో ప్రియాంక పాల్గొంటారు. ఈ సభలోనే మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డితో పాటు మరికొందరు నేతల కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ సభలో టీపీసీసీ మహిళా డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని పార్టీ ఇప్పటికే ప్రకటించింది.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్

కేసులో మరో ట్విస్ట్..

మరో ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 11: తెలంగాణలో వివాదాస్పదమైన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో రోజురోజుకు కొత్త ట్విస్టులు వస్తున్నాయి. తాజాగా ఈ కేసులో పోలీసులు మరో ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేశారు. ఈ ముగ్గురి అరెస్టుతో ఈ లీకేజీ

కేసులో ఇప్పటివరకు 77 మందిని అరెస్టు చేశారు. రమేష్ అనే నిందితుడు ఏఈ పేపర్‌ను 30 మందికి విక్రయించాడు. రమేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడు ఇచ్చిన సమాచారంతో అరెస్టులు చేయడం కొనసాగిస్తున్నారు. రమేష్ పరీక్ష రాసిన తర్వాత డబ్బులు ఇచ్చేలా అభ్యర్థులతో డీల్ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే మరోవైపు ఐదు ప్రత్యేక బృందాలతో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది.

హిమాచల్‌లో వరద బీభత్సం..
టూరిస్ట్ హాట్‌స్పాట్‌లో కొట్టుకుని పోయిన కార్లు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11: నైతుతి రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాల దాటికి ఉత్తరాది రాష్ట్రాలు వణికిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రకృతి ప్రకోపంతో హిమాచల్‌ప్రదేశ్ తల్లడిల్లిపోతోంది. తాజాగా హిమాచల్ ప్రదేశ్ లోని వరద ఉధృతికి కొట్టుకుని పోయిన కార్ల వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజా సంఘటన రాష్ట్రంలోని సోలన్ జిల్లాలోని పర్వానూ అనే పర్యాటక ప్రదేశంలో జరిగినట్లు తెలుస్తోంది.సమీపంలోని బాల్కనీలపై ఉన్న వ్యక్తులు కేకలు వేస్తూ ఆ నీటిలో కొట్టుకుని పోతున్న కార్లను తమ మొబైల్‌లో బంధింస్తున్నట్లు వీడియో చూపించింది. గత కొన్ని గంటల పాటు కురిసిన భారీతో వర్షం వీధులన్నీ జలమయం అయ్యాయి. వరద ఉధృతికి వంతెనలు కొట్టుకుపోతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజల జీవితం అగమ్యగోచరంగా మారింది. అంతేకాదు రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అందరూ ఇళ్లలోనే ఉండమని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వీల్లో టైపు దొంగలు..

ఏకంగా ఏటీఎం మెషీన్‌నే ఎత్తుకెళ్లారు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11:
దొంగలు రెచ్చిపోతున్నారు. ఏకంగా ఏటీఎం మిషన్లనే కొల్లగెట్టేస్తున్నారు. స్థానికులంతా గాఢ నిద్రలో ఉండగా ఏటీఎం మెషీన్‌ను ట్రక్కులో ఎక్కించి ఎత్తుకెళ్లిపోయారు. పైగా ఈ ఘటన జరిగిన ప్రదేశానికి కూతవేటు దూరంలోనే పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఉందని తెలిసి ప్రజలు అవాక్కవుతున్నారు. విస్తుగొలిపే ఈ ఘటన మహారాష్ట్రలో జరిగింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏటీఎం చోరీ ఘటనకు సంబంధించిన దృశ్యాలన్ని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. సవాలుగా తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన ఏటీఎం మెషీన్ చోరీ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆదివారం తెల్లవారుజామున ఏటీఎం మెషీన్‌లోకి చొరబడిన నలుగురు దుండగులు ఏటీఎం మెషీన్‌లోంచి డబ్బులు తీసేందుకు విఫల యత్నం చేశారు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా.. ఏటీఎం మెషీన్‌లోకి చొరబడిన దుండగులు రెయిన్‌కోట్లు ధరించి ఉన్నారు. ముఖాలు కూడా కనిపించకుండా మాస్క్‌లు వేసుకుని జాగ్రత్తపడ్డారు. జులై9 ఆదివారం తెల్లవారుజామున 4.00 గంటల ప్రాంతంలో ఏటీఎం మెషీన్‌లోకి ప్రవేశించిన దొంగలు..తొలుత ఏటీఎం మెషీన్ తెరిచేందుకు ప్రయత్నం చేశారు. కానీ, ఏటీఎం మెషీన్ ఎంతకూ తెరుచుకోవడంతో ఇక లాభం లేదని భావించి ఏకంగా ఏటీఎం మెషీన్నే ఎత్తుకెళ్లారు. వెంట తెచ్చుకున్న ట్రక్కులో ఏటీఎం మెషీన్ ఎక్కించి అక్కడ్నుంచి పరారయ్యారు.

2075 నాటికి భారత్ అమెరికాను అధిగమిస్తోంది

గోల్డ్‌మన్ సాచ్స్ సంచలన నివేదిక

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11:
భారతదేశం ఆర్థిక వ్యవస్థపై ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా సంచలన నివేదిక వెల్లడించింది. 2075వ సంవత్సరం నాటికి భారతదేశం అమెరికాను అధిగమించి రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాచ్స్ తెలిపింది. భారతదేశంలో రోడ్లు, రైల్వేల రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని బ్యాంకు నివేదిక పేర్కొంది.ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది.

అనుకూలమైన జనాభా, కొత్త ఆవిష్కరణలు, అధిక మూలధన పెట్టుబడులు, పెరిగిన కార్మికుల ఉత్పాదకతతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. కొత్త ఆవిష్కరణలు, కార్మికుల ఉత్పాదకత పెరగడంతో గణనీయమైన చోదక శక్తిగా మారుతుందని నివేదిక తెలిపింది. భారతదేశంలో పొదుపు రేటు పెరగడం వల్ల ఆర్థిక రంగ అభివృద్ధి చెందుతుందన్నారు. పొదుపుతో పెట్టుబడి మూలధనం పెరగనుందని నివేదిక పేర్కొంది.మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగాల సృష్టితో ప్రైవేటు రంగం సామర్థ్యం పెరుగుతుందని గోల్డ్ మన్ సాచ్స్ తెలిపింది. శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు పెరగకపోతే భారతదేశ ఆర్థిక వృద్ధికి ప్రధాన ప్రతికూల ప్రమాదం అని నివేదిక పేర్కొంది.

శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యంరేటు పెంచాల్సిన అవసరం ఉందని బ్యాంక్ నివేదిక వివరించింది.

వీడు మామూలోడు కాడు..
భయంతో బతికున్న బల్లిని తినేశాడు!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11:
అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ యువకుడు పోలీసులను అరెస్ట్ చేస్తారనే భయంతో బతికున్న బల్లిని అమాంతంగా మింగేసింది. ఈ విచిత్ర ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాన్పూర్‌లోని మల్లవాన్ ప్రాంతానికి చెందిన మహేష్ అత్యాచారం కేసులో పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. దీంతో వారు జైలుకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఎక్కడ అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తారేమోననే భయంతో సాద్ పోలీస్ స్టేషన్‌లోనే మహేష్ బతికున్న బల్లిని మింగేశాడు. వెంటనే పోలీసులు మహేష్‌ను చికిత్స నిమిత్తం భిటార్‌గావ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైద్యులు చికిత్స చేసి మహేశ్ కడుపులోని బల్లిని బయటకు తీశారు. ప్రస్తుతం మహేష్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. బల్లిని ఎందుకు మింగావని పోలీసులు మహేష్‌ను ప్రశ్నించగా.. జైలుకు తీసుకెళ్తారేమోననే భయంతోనే అలా చేసినట్లు చెప్పాడని ఎస్ఏడీ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి విజయ్ శుక్లా తెలిపారు.

నేపాల్‌లో కుప్పకూలిన హెలికాప్టర్..
పైలట్ సహా ఆరుగురు మెక్సికన్లు మృతి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11:
నేపాల్‌లో హెలికాప్టర్ అదృశ్యమైన ఘటన విషాదంగా మారింది. సోలుఖుంబు నుంచి ఖాట్మండుకు బయల్దేరిన హెలికాప్టర్.. 10 నిమిషాల తర్వాత కంట్రోల్ టవర్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఉదయం 10:04 గంటలకు బయల్దేరిన హెలికాప్టర్.. 10 :13 గంటలకు అదృశ్యమైంది. దీంతో త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సిబ్బంది అప్రమత్తమైంది. అనంతరం మరో చాపర్ ద్వారా అదృశ్యమైన హెలికాప్టర్‌ను గాలించగా, లామ్జురా పాస్ వద్ద కొండల్లో హెలికాప్టర్ కుప్పకూలినట్లు గుర్తించారు.

దీంతో పైలట్‌తో పాటు ఐదుగురు మెక్సికన్లు ప్రాణాలు కోల్పోయారు. కుప్పకూలిన చాపర్‌ను మనాంగ్ ఎయిర్ హెలికాప్టర్‌గా అధికారులు నిర్ధారిం చారు. మృతులను మెక్సికోకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారని అధికారులు తెలిపారు. జీ ఫెర్నాడో(95), రిన్‌కాన్ ఇస్మా యిల్(98), గోంగలెజ్ అబ్రిల్(72), గోంగలెజ్ ఓలాషియో లూజ్(65), మరియా జెస్సీ(52) గా గుర్తించారు. వీరిలో ఇద్దరు పురుషులు కాగా, మిగతా వారు మహిళలు.

పెండ్లి బస్సు బోల్తా.. ఆరేళ్ల చిన్నారి సహా
ఏడుగురు మృతి, 30 మందికి గాయాలు

ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 11: ప్రకాశం జిల్లా దర్శి దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దర్శి దగ్గర సాగర్ కెనాల్ లో అదుపుతప్పి పెళ్లి బృందం బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఓ చిన్నారి, ఓ యువకుడు కూడా ఉన్నాడు. మరో 30 మందికి గాయాలయ్యాయి. పాదిలి నుంచి కాకినాడకు వివాహ రిసెప్షన్ కోసం వెళుతుండగా డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నట్టుగా

తెలిసింది. వీరంతా పాదిలిలో సోమవారం జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరై కాకినాడలో రిసెప్షన్ కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులో బయలుదేరింది పెళ్లి బృందం. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సాయంతో బోల్తా పడిన బస్సును బయటకు తీశారు.మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నట్టుగా తెలిసింది. బస్సు కింద నీళ్లలో చిక్కుకున్న ఆరేళ్ల పాప షేక్ హీనా మృతదేహం లభించింది. అతి కష్టం మీద పాప మృతదేహాన్ని బయటకు తీశారు పోలీసులు. మృతుల్లో పెళ్లికూతురు మేనత్తలు ఇద్దరు, అమ్మమ్మ, మేనత్త కోడలు ఉన్నట్టు తెలిసింది. పాదిలి పెద్ద మసీదు హాఫీజ్ సాబ్ అబ్దుల్ అజీజ్ , ఆయన భార్య, మనవరాలు ఉన్నట్టు గుర్తించారు.

వార్తలు చదువుతోంది లిసా..
ఈమె నిజమైన యాంకర్ కాదు... ?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11: పైన ఫొటో చూడగానే ఎవరో యాంకర్ వార్తలు చదువుతున్నట్లు కనిపిస్తోంది కదూ! మీరు చూసింది నిజమే ఆ యాంకర్ వార్తలు చదువుతోంది. కానీ ఆ ఫొటోలో ఉన్న మహిళ నిజమైన యాంకర్ కాదు. అవును మీరు చదివింది నిజమే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వార్తలు చెబుతోన్న ఏఐ న్యూస్ యాంకర్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక రంగంలో ఎలాంటి మార్పులు తీసుకొచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా మీడియా రంగంలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఉపయోగం వచ్చేసింది.తాజాగా ఒడిశాకు చెందిన ఓటీవీ దేశంలోని తొలిసారి ఏఐ న్యూస్ యాంకర్‌తో వార్తలు చదివించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. చీర కట్టులో ఉన్న ఈ ఏఐ న్యూస్ యాంకర్ ఇంగ్లిష్‌లో వార్తలు చకచకా చదివేస్తోంది. అచ్చంగా మనిషి ఎలా మాట్లాడుతుందో అలాగే మాట్లాడుతోంది. లిప్ సింక్ కూడా పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ కావడం ప్రత్యేకతగా చెప్పొచ్చు.ఈ ఏఐ న్యూస్ యాంకర్‌గా లిసాగా నామకరణం చేశారు. ఈ యాంకర్.. టీవీతో పాటు, డిజిటల్ ప్లాట్ ఫామ్స్‌లోనూ ప్రధాన యాంకర్‌గా వ్యవహరిస్తుందని ఓటీవీ యాజమాన్యం తెలిపింది. టీవీ బ్రాడ్ కాస్టింగ్, జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఈ యాంకర్‌ను తీసుకొచ్చామని టీవీ యాజమాన్యం తెలిపింది. లిసా

భవిష్యత్తులో ప్రాంతీయ భాషల్లోనూ మాట్లాడుతుందని చెప్పుకొచ్చారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలు కోల్పోవడం ఖాయమనే చర్చ జరుగుతోన్న తురణంలో ఇలాంటి సంఘటనలు వార్తలకు ఊతమిచ్చినట్లవుతుంది.

మోదీ, యోగిలను చంపేస్తానంటూ ఫోన్ కాల్..
యూపీ పోలీసుల అలర్ట్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11: ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లను చంపేస్తానంటూ ఓ ఆగంతుకుడు ఫోన్ చేయడంతో యూపీ పోలీసులు అప్రమత్తమయ్యారు. సెల్ లొకేషన్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటన యూపీలోని గోరఖ్ పూర్ లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నిందితుడు మద్యం మత్తులో బెదిరింపులకు పాల్పడ్డట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.సోమవారం యూపీ పోలీసుల హెల్ప్ లైన్ 112కు ఓ వ్యక్తి ఫోన్ చేసి ప్రధాని, సీఎంలను చంపేస్తానని బెదిరించాడు. తన పేరు అరుణ్ కుమార్ అని, గోరఖ్ పూర్ లోని భుజౌలి కాలనీ నివాసినని చెప్పాడు. దీంతో అలర్ట్ అయిన పోలీసులు సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆ వ్యక్తిని గుర్తించారు. గోరఖ్ పూర్ జిల్లాలోని దేవ్రద్ గ్రామం నుంచి ఫోన్ వచ్చినట్లు గుర్తించారు. గ్రామానికి వెళ్లి విచారించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా.. మద్యం మత్తులో ఫోన్ చేసినట్లు చెప్పాడని పోలీసులు తెలిపారు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రూ.కోటి ఖర్చుతో ప్రభుత్వ బడిని రీడెవలప్ చేసిన కేసీఆర్ మనవడు

తన స్కూల్‌లో నిధులు సేకరించి ఖర్చుపెట్టినట్లు వెల్లడి
రేపు విద్యాశాఖ మంత్రి ప్రారంభిస్తారంటూ హిమాన్షు ట్వీట్
తాతకు తగ్గ మనవడంటూ మెచ్చుకుంటున్న నెటిజన్లు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూలై 11: ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు మరోసారి పెద్ద మనసు చాటుకున్నాడు. హైదరాబాద్ పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు కొత్త రూపు తీసుకొచ్చాడు. సుమారు రూ.కోటి ఖర్చు చేసి రీడెవలప్ చేశాడు. దీంతో గచ్చిబౌలి కేశవనగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం కార్పొరేట్ స్కూల్ లా మారిపోయింది. హిమాన్షు పుట్టిన రోజు సందర్భంగా రేపు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ స్కూలును ప్రారంభిస్తారు.ఈ విషయాన్ని హిమాన్షు తన ట్విట్టర్ లో పోస్టు చేశారు. స్కూలు పరిస్థితి ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా మారిపోయిందనేది వివరిస్తూ ఫొటోలను పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ వైరల్ గా మారింది. తాతకు తగ్గ మనవడంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఖాజాగూడలోని ఓ ప్రైవేట్ స్కూలులో చదువుతున్న హిమాన్షు.. క్రియేటివ్ యాక్షన్ సర్వీస్ (సీఏఎస్) అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. సీఏఎస్ తరఫున తమ స్కూలుకు దగ్గర్లో ఉన్న కేశవనగర్ ప్రాథమికపాఠశాలను దత్తత తీసుకున్నారు. తన స్కూల్ లో నిధులు సేకరించి ఈ పాఠశాల అభివృద్ధికి ఖర్చు పెట్టారు. విద్యార్థులకు బెంచీలు, టాయిలెట్ల నిర్మాణం, భోజనం గది, ఆట స్థలం తదితర సౌకర్యాలను సీఏఎస్ నిధులతో సమకూర్చాడు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాములు యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

రాంగ్‌రూట్‌లో స్కూల్ బస్..
ఢీకొట్టిన కారు.. ఆరుగురు స్పాట్ డెడ్..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 11: దేశ రాజధాని ఢిల్లీలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఉదయం 6 గంటల సమయంలో స్కూల్ బస్సు, కారు మధ్య ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు రాంగ్ రూట్‌లో వస్తోందని తెలిసింది. ఇది బస్సు డ్రైవర్ తప్పిదంగా తెలిసింది. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఓ చిన్నారి కూడా ఉందని తెలిసింది. కాగా, చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. స్కూల్ బస్సు డ్రైవరు ఢిల్లీలోని ఘాజీపూర్ నుంచి రాంగ్ రూట్‌లో వస్తున్నాడు. అదే సమయంలో మీరట్ నుంచి గురుగ్రామ్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో కారులో 8మంది ఉన్నట్టుగా తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు మొత్తం సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

ట్రెండీ లుక్స్‌లో...
ఆహా ఏమీ అందం అనిపిస్తున్న ఐశ్వర్య రాజేష్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: తెలుగమ్మాయి అయిన తమిళంలో కథానాయికిగా తెరంగేట్రం చేసింది ఐశ్వర్య రాజేష్. తర్వాత తెలుగులో కూడా కొన్ని చిత్రాల్లో హీరోయిన్ గా చేసింది. కౌశల్య కృష్ణమూర్తి చిత్రంలో ఉమెన్ క్రికెటర్ పాత్రలో ఆకట్టుకుంది ఈ భామ. ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. ఆ తరువాత తెలుగులో విజయ్ దేవరకొండ వరల్డ్ ఫేమస్ లవర్, నాని టక్ జగదీష్ చిత్రాలతో మెప్పించింది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది.



నిషిలో తారల మెరుస్తున్న అందాల భామ..
చీరలో అందమే అసూయా పడేలా అనసూయ..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: బుల్లితెరపై అందాల యాంకర్‌గా అందరికి సుపరిచితం అనసూయ. ఇప్పటికే స్టార్ హీరోల చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించి మెప్పించింది ఈ భామ.

రంగస్థలంలో రంగమ్మ అత్తగా తన నటనతో ఆకట్టుకుంది అనసూయ. పుష్ప చిత్రంలో నెగిటివ్ రోల్‌లో ఆహా అనిపించింది. ఇటీవల వచ్చిన విమానం చిత్రంలో వేశ్య పాత్రలో మెప్పించింది. తాజాగా సోషల్ షేర్ చేసిన ఈమె ఫోటోలకు కుర్రాళ్లు ఫిదా అవుతున్నారు.

చూసి మురవాలె.....

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11:
యాంకర్ శ్రీముఖి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక వైపు యాంకర్ గా చేస్తూ.. మరోవైపు అడపాదడపా సినిమాల్లో కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంటుంది శ్రీముఖి. బిగ్ బాస్ 3 లో రన్నర్ గా నిలిచి తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ.

డిఫరెంట్ లుక్ తో శ్రీముఖి అందాల రచ్చ.. వైరల్ అవుతున్న లేటెస్ట్ పిక్స్

ఆరు భాషల్లో మాట్లాడతా..
హైదరాబాద్‌లో నా స్లాంగ్ ఇలాగే ఉంటది: రష్మిక

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: అల్లు అర్జున్ పుష్ప సినిమాతో పాన్ ఇండియా హీరోయిన్‌గా పాపులారిటీ సొంతం చేసుకుంది రష్మిక మందన్నా. ప్రస్తుతం ఆమె దక్షిణాది భాషలతో హిందీలోనూ వరుసగా సినిమాలు చేస్తోంది. ఈక్రమంలో తన సినిమా షూటింగుల కోసం తరచూ ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలను చుట్టేస్తోంది రష్మిక. దీంతో నేషనల్ క్రష్‌గా క్రేజ్ తెచ్చుకుంది రష్మిక. సోషల్ మీడియాలోనూ శ్రీవల్లికి భారీగా ఫాలోయింగ్ ఉంది. నెటిజన్లతోనూ తరచూ ముచ్చటిస్తుంటుంది. తాజాగా తన ఫాలోవర్లతో ఛాట్ చేసిన ఆమె వారు అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలిచ్చింది.

ఈ సందర్భంగా తాను ఆరు భాషల్లో మాట్లాడతానని ఫ్యాన్స్‌తో చెప్పుకొచ్చింది రష్మిక. హైదరాబాద్‌లో వాళ్లతో మాట్లాడేటప్పుడు మాత్రం 'నమస్తే.. బాగున్నారా' అని పలకరిస్తానంటూ తెలిపింది. ఇక తనకు ఇష్టమైన ప్రదేశం కూర్గ్ అని, కొరియన్ ఫ్రైడ్ చికెన్‌ను ఇష్టంగా తింటానంది రష్మిక. ప్రస్తుతం పుష్ప2తో పాటు యానిమల్, రెయిన్‌బో సినిమాల్లోనూ నటిస్తోంది శ్రీవల్లి.

మళ్లీ ట్రెండింగ్‌లోకి సమంత.. ఇప్పుడు హెల్త్ టాపిక్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: మళ్లీ వార్తల్లో వినిపిస్తున్నారు సమంత. ఈ సారి తన ఆరోగ్య పరిస్థితుల గురించి, తీసుకుంటున్న థెరపీ గురించి, ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలం గురించి డీటైల్స్ పంచుకున్నారు. ఇంతకీ సమంత ఇప్పుడెలా ఉన్నారు? సమంత ఏడాది పాటు షూటింగులకు బ్రేక్ తీసుకుంటున్నారు. నిర్మాతల దగ్గర తీసుకున్న అడ్వాన్సులను కూడా తిరిగి ఇచ్చేస్తున్నారు. ఇదీ ఈ మధ్య కాలంలో ట్రెండ్ అయిన న్యూస్. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా కొన్ని మాటలు వినిపిస్తున్నాయి. ఆమె యుఎస్ వెళ్తున్నారు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకోవడం కోసమే ఈ బ్రేక్ అనేది ఆ మాటల సారాంశం. గత కొంత కాలంగా మయోసైటిస్‌తో బాధపడుతున్నారు సమంత. మజిల్స్ వీక్‌నెస్ వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఆరు నెలలు అతి కష్టం మీద గడిచాయి. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకోవాల్సి వచ్చిందంటూ తను దాటుకుని వచ్చిన కాలం గురించి సోషల్ మీడియాలో పంచుకున్నారు సామ్.

అభిమానుల ఫొటోలతో
'బ్రో' కటౌట్లు..
పవన్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ఆఫర్..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ , సుప్రీం హీరో సాయిధరమ్ కలిసి నటిస్తున్న సినిమా 'బ్రో' . తమిళంలో మంచి విజయం సాధించిన వినోదయ సితం సినిమాకు ఇది రీమేక్‌గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో తెరకెక్కుతోంది. సముద్రఖని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. ఇందులో పవన్ మరోసారి దేవుడిగా కనిపించబోతున్నాడు. ఇప్పటికే బ్రో సినిమా షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుందని చిత్రయూనిట్ తెలిపారు. ఇక బ్రో సినిమాను జులై 28న రిలీజ్ చేస్తామని కూడా ప్రకటించారు.

ప్రమోషన్స్‌లో భాగంగా అభిమానులకు స్పెషల్ ఆఫర్ ఇచ్చింది నిర్మాణ సంస్థ. స్టార్ హీరోల సినిమా రిలీజ్‌లు వస్తే వాళ్ళ భారీ కటౌట్స్ పెడతారని తెలిసిందే. అయితే ఈ కటౌట్స్‌ని ఫ్యాన్స్ ఫొటోస్ తోనింపేస్తామని నిర్మాణ సంస్థ ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రో సినిమాకు పవన్, తేజ్ కటౌట్స్‌లో అభిమానుల ఫోటోలు పెడతామని, ఫొటోలతోనే కటౌట్స్ తయారుచేస్తామని, అందుకోసం అభిమానులు తమకు నచ్చిన ఫోటోలను పంపించండి అంటూ ఓ లింక్ కూడా ఇచ్చింది.

అందంలో అతిలోక సుందరి .. ట్రెండీ డ్రెస్‌లో జాన్వీ..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీరంగ ప్రవేశం చేసింది జాన్వీ కపూర్. బాలీవుడ్ ధఢక్ చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయం అయింది. తర్వాత ఘోస్ట్ స్టోరీస్, గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, మిలి వంటి పలు చిత్రాల్లో నటించి ఆకట్టుకుంది ఈ భామ. ఇటీవల అరుణ్ ధావన్ బవాల్ చిత్రం పూర్తి చేసింది. ప్రస్తుతం ఎన్టీఆర్ దేవర చిత్రంతో కథానాయకిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుంది ఈ ముద్దుగుమ్మ.

నీ శరీరమే నీ ఆస్తి అంటూ ... టాప్ లెస్ వీడియో పోస్ట్....!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కిరిక్ పార్టీ చిత్రంతో కన్నడ పరిశ్రమలోకి అడుగుపెట్టింది సంయుక్త హెగ్డే . ఇదే సినిమా తెలుగులో నిఖిల్ హీరో గా కిరాక్ పార్టీగా తెరకెక్కింది ఇందులోనూ సంయుక్త నటించింది. పలు భాషల్లోని రియాల్టీ షోలలో పాల్గొంటూ తన కంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. అయితే.. సినిమాలతో కంటే వివాదాలతోనే ఆమె ఎక్కువగా వార్తల్లో నిలుస్తుంటుంది. బిగ్‌బాస్ సీజన్ 5 లో వైల్డ్ కార్డు ద్వారా ఎంట్రీ ఇచ్చి.. తన తోటి కంటెస్టెంట్‌ను చెంపపై కొట్టింది. దీంతో ఆమె ప్రవర్తనను అందరూ ఖండించారు.ఇక 2020లో బెంగళూరులోని ఓ పార్క్‌లో తన స్నేహితురాలితో వర్కౌట్లు చేస్తున్న సమయంలో ఓ మహిళ సంయుక్త ధరించిన దుస్తులపై అభ్యంతరం వ్యక్తం చేసింది.

అప్పుడు ఆ ఇష్యూ వైరల్‌గా మారింది. ఇక గతేడాది మైక్రో బికినీలో కనిపించి మరోసారి వార్తల్లో నిలిచింది. ఇక తాజాగా తన సోషల్ మీడియాలో టాప్‌లెస్ వీడియో పోస్ట్ చేసి వార్తల్లోకి వచ్చింది. ఆ వీడియో కింద నీ దేహమే నీ ఆస్తి అంటూ రాసుకొచ్చింది.

బాలయ్యకు నచ్చితే అంతే మరి..
లేడీ ఫ్యాన్ బర్త్‌డేను గ్రాండ్‌గా ..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 11: నందమూరి బాలకృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పైకి గంభీరంగా కనిపించినా ఆయన చాలా సున్నితత్వం. చాలాసార్లు అభిమానుల మీద కస్సుబుస్సులాడినా బాలయ్య మనసు బంగారం. ఆయన గురించి పూర్తిగా తెలిసినవారు ఏదైనా ఇదే మాటలు చెబుతారు. స్వచ్ఛమైన మనసు కలిగిన బాలయ్య తనకు ఎవరైనా నచ్చితే అంతే.. వారి కోసం ఏమైనా చేస్తారు. ఇటీవల విమానంలో పరిచయమైన ఓ వ్యక్తి గృహప్రవేశానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారాయన. ఈ విషయాన్ని మరోసారి నిరూపించుకున్నారు నందమూరి నటసింహం. ఒక లేడీ అభిమాని పుట్టిన రోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. కేక్ కటింగ్ చేయించి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అమెరికాలో జరుగుతున్న తానా సంబరాల్లో ఈ అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తానా సభల కోసం ప్రస్తుతం అమెరికాలోని ఫిలడెల్ఫియాలోనే ఉంటున్నారు బాలయ్య. ఆయన సతీమణి వసుంధరతో పాటు తానా మహాసభల్లో పాల్గొన్నారాయన. ఈ సందర్భంగా తెలుగు వారి రాజసం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తుల్లో దర్శనమిచ్చారు బాలయ్య. ఈ క్రమంలోనే ఒక అమ్మాయి బాలకృష్ణ దగ్గరకు వచ్చింది. తన పుట్టిన రోజు అని చెప్పగానే.. వెంటనే ఆమెతో కేక్ కటింగ్ చేయించాడు.అనంతరం బాలకృష్ణ, ఆయన సతీమణి అక్షింతలు వేసి ఆ అమ్మాయిని మనసారా ఆశీర్వదించారు. తద్వారా ఆ లేడీ అభిమానికి జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాన్ని అందించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838